

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 01 | సెప్టెంబర్ 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

భీమవరం ............ 15-02-09

తాడినాడ ............ 07-08-09

జిన్నూరు ............ 13-08-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-02-2009, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము వీటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే మనస్సుని అదుపులో పెట్టుకోవటానికి, మనస్సుని నిగ్రహించుకోవటానికి ఇవన్నీ మనం చేస్తున్నాము. మనస్సుని ఒకేసారి కంట్రోలు చేసుకోవటం చాలాకష్టం. మనస్సును నిగ్రహించటం చాలా కష్టమే కాని దానికి రెండు ఉపాయాలు ఉన్నాయి. 1. అభ్యాసము, 2. వైరాగ్యము అని పరమాత్మ చెప్పాడు. మనిషి అయ్యాక ఎంతోకొంత వైరాగ్యం ఉండాలి ఎంతోకొంత వైరాగ్యము ఉన్నవారే సమాజానికి ఉపయోగపడగలరు కాని వైరాగ్యము లేకపోతే సమాజానికి ఉపయోగపడలేరు. ఈ ప్రపంచంలో మనల్ని సుఖపెట్టే వస్తువు ఒక్కటీ లేదు. సుఖం అనేది బయటలేదు. నిజమైనసుఖం మన హృదయంలో ఉంది, శాంతి మన హృదయంలో ఉంది. అది మనకు అనుభవంలోనికి రావాలి. అది అనుభవంలోనికి రావాలంటే అద్వైతానుభవం ఉండాలి. అద్వైతానుభవం లేకుండా ఆత్మానందం రాదు.

హృదయంలో ఉన్న సుఖం ఎలా అందుతుందో స్వామివారు గీతలో చెప్పారు. దానికి ముందు ఆహారశుద్ధి చెప్పాడు. మనం తిండి దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. శాస్త్రానికి అనుగుణంగా మన ప్రవర్తన ఉండాలి. మన మనస్సు చెప్పినట్టు వినకుండా భగవంతుడు చెప్పినట్టు చేయాలి. మనకి ఆహారశుద్ధి, ఇంద్రియశుద్ధి, ప్రవర్తనలో శుద్ధి లేకుండా

మనం ఎంత ప్రయత్నం చేసినా అంతఃకరణశుద్ధి రాదు. అంతఃకరణశుద్ధి లేకుండా ఈ సృష్టిలో ఇప్పటివరకూ ఎవరికీ ఆత్మజ్ఞానం కలగలేదు. ఆహారశుద్ధి, ఇంద్రియశుద్ధి, ప్రవర్తనలో శుద్ధి ఇవన్నీ అయిన తరువాత అంతఃకరణశుద్ధి వస్తుంది. అంతఃకరణశుద్ధి వచ్చిన తరువాత ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుడు లేడని కొంతమంది అంటున్నారు, భగవంతుడు ఉన్నాడని కొంతమంది అంటున్నారు. నాకు ఎటువెళ్ళాలో తెలియటం లేదు అని ఒకరు కంచిపరమాచార్యులని అడిగారు. భగవంతుడు లేడని చెప్పేవారితోటి కలిసి తిరిగితే నువ్వు స్లోగా పాడైపోతావు. భగవంతుడు ఉన్నాడని చెప్పేవారితోటి సహవాసం చేస్తే వారి వైబ్రేషన్స్ నీకు పని చేస్తాయి, నువ్వు తరిస్తావు. అందుచేత భగవంతుడు ఉన్నాడని చెప్పేవారితోటి నువ్వు సహవాసం చెయ్యి, భగవంతుడు లేడని చెప్పేవారితోటి నువ్వు సహనాసం చెయ్యవద్దు అని పరమాచార్యులు చెప్పారు.

మనకి భగవద్గీత ప్రమాణము. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే నీకు రూపబుద్ధిపోలేదు, నామబుద్ధిపోలేదు కాని అసలు వస్తువుకి రూపం లేదు, నామం లేదు. లోపల సద్వస్తువు నిర్గుణం, నిరాకారం నువ్వు అక్కడికి చేరుకోవాలి ఆ నిర్గుణాన్ని, నిరాకారాన్ని నువ్వు ఆరాధించలేవు. నువ్వు నిర్గుణాన్ని, నిరాకారాన్ని ఆరాధించటం ఎటువంటిది అంటే గోదావరిని మనం ఈదటంలాంటిది. ఈదేవాడు మధ్యలో మునిగిపోవచ్చు. నువ్వు సాధనలో ముందు సాకారాన్నే పెట్టుకో. సాకారాన్ని పెట్టుకుంటే నావమీద ప్రయాణంలాంటిది. నావమీద కూర్చుంటే నది దాటించేస్తాడు. సగుణం అటువంటిది. మన ఇంద్రియాలకి అతీతంగా ఏమీలేదు, మన ఇంద్రియాలకి తెలిసేదే నిజం అని ఇలా అనుకునేవారు నిరాకారాన్ని, నిర్గుణాన్ని పట్టుకోలేరు. అందుచేత సాకారాన్ని, సగుణాన్ని పట్టుకుని సిన్సియర్‌గా సాధన చేస్తూ ఉంటే తరువాత ఈశ్వరుడు మీకు ఏమిచెయ్యాలో అది చేస్తాడు. సద్వస్తువు మన హృదయంలో ఉంది. దానిని మన మనస్సు అందుకోలేదు, మన బుద్ధి అందుకోలేదు, మన ఇంద్రియాలు అందుకోలేవు. అందుకోలేకుండా అది నేనై ఉన్నాను, అది నేనై ఉన్నాను అంటే చివరికి నువ్వు పాడైపోతావు, నీపతనం ప్రారంభమవుతుంది. అందుచేత ఎవరికైనా ఆధ్యాత్మికంగా సలహా చెప్పేటప్పుడు గురువు ఏమి చెయ్యాలంటే ముందువారు ఏ స్థాయిలో ఉన్నారు, మనం ఎలా చెబితే వారికి అర్థం అవుతుంది, ఎలా చెబితే తరువాత మెట్టుకి వెడతారు ఇవన్నీ బాగా ఆలోచించి చెప్పాలి. వారికి ఉన్న బలహీనతలు ఏమిటి, ఆ బలహీనతలలోనుండి వారిని ఎలా విడుదల చెయ్యాలి అని ఇవన్నీ చూసుకుని చెబుతాడు. వాడు గురువు. కొంతమంది

గురువులు ఏమి చేస్తారంటే ఆయన చెప్పేమాటలు మీరు వినకపోయినా ఏవో మాటలు చెపుతూ మీరు పరాగ్గా ఉండగా నోట్లో పోసేస్తారు అటువంటి గొప్ప గురువులు ఉన్నారు.

మనం ఈ జన్మలో చేయవలసిన కర్తవ్యం ఏమిటి అంటే మనం పుణ్యాన్ని పోగుచేసుకున్నా జన్మ వస్తుంది, పాపాన్ని పోగుచేసుకున్నా జన్మవస్తుంది. మనకి ఆత్మజ్ఞానం కావాలంటే మన రూపం, మన నామం ఎంత తొందరగా మరచిపోతే అంతవేగంగా భగవంతుడు మిమ్మల్ని జ్ఞానంతోటి అనుగ్రహిస్తాడు, భక్తి, వైరాగ్యాలతోటి అనుగ్రహిస్తాడు. నీకు రూపబుద్ధి, నామబుద్ధి పోకుండా నువ్వు లోపలికి ఎలా వెళతావు? లోపలికి వెళ్ళటానికి నీకు అసలు తూకం లేదు. బరువు ఏమీ లేదు కానీ ఉందని అనుకుంటున్నావు. అది ఆత్మ వంచన. మనం సాధన చేసేటప్పుడు మనం ఏ స్థాయిలో ఉన్నాము, ఇక్కడినుంచి ఎదరకి ఎలాగ వెళ్ళాలి అని మనలో మనం ఆలోచించుకుని, మన మైనస్ పాయింట్స్ ఏమిటి? మన ప్లెస్ పాయింట్స్ ఏమిటి? ఏ వాసన వల్ల మనం లోకంచేత బంధింపబడుతున్నాము ఇవన్నీ కూడా మనం విచారణ చేసుకోవాలి. మనం అందరం డ్యూటీ చెద్దాము కానీ ఏదీ ఆశించవద్దు. పుణ్యం బంగారపు సంకెళ్ళు, పాపము ఇనుప సంకెళ్ళు. అదీ బంధిస్తుంది, ఇదీ బంధిస్తుంది. అందుచేత మీరు ఏ పని చేసినా ఈశ్వరార్పణంగా చెయ్యాలి. ఈశ్వరార్పణంగా చేస్తే మనకి ఈశ్వరుని దయ కలుగుతుంది. ఈశ్వరుని దయ కలిగితే అన్నీ మన చేతిలో ఉన్నట్టే, మనం అంతా పొందినట్టే.

పుట్టినప్పుడు అందరూ పాపంమూటో, పుణ్యంమూటో వేసుకుని వస్తున్నారు. ఇంక మీరు పాప, పుణ్యాల మాట వదిలేయండి. మీరు మూటలు మోసుకువచ్చి ఆ మూటల్లో ఇంకా బరువు వేసేసుకుంటున్నారు. అందుచేత భగవంతుడు గీతలో ఏమని చెప్పాడంటే మీరు పుణ్యం మూట తెచ్చుకున్నారు అనుకోండి ఆ పుణ్యం ఇక్కడే వంచేయండి, మీరు పాపం మూట తెచ్చుకున్నారు అనుకోండి ఆ మూటలో పాపం కూడా ఇక్కడ వంచేయండి. అది ఎలా వంచాలో నేర్చుకోండి. అది ఆత్మవిద్య అన్నాడు. మీరు మూటలు ఇక్కడ వంచకుండా పుణ్యం మూట తెచ్చుకుంటే మళ్ళీ దాంట్లో పుణ్యం పెంచేసుకుని, పాపం మూట తెచ్చుకుంటే ఇంకా దానిలో పాపం పెంచేసుకొని కొత్తజన్మలోకి వెడుతున్నారు. ఇంక మీకు జన్మరాహిత్యస్థితి ఎలా వస్తుంది? మూటలు విప్పండి విప్పి అందులో ఉన్నది ఏదో కింద పడేయండి. దాని వలన మీకు మోక్షం వస్తుందని తెలియక, నారాయణుడి యొక్క స్వరూపం మీకు వస్తుందని తెలియక మూటలు విప్పలేకపోతున్నారు, కింద పడేయలేకపోతున్నారు. మూటలు విప్పండి. అదే మీరు చేసే సాధన.

మీరు పుణ్యపాపాలు ఇక్కడ వదిలించుకుంటే మీకు అమృతస్థితి కలుగుతుంది.

తపస్సు అంటే ముక్కు మూసుకోవటం, మీ శరీరాన్ని శుష్కింపచేయటం తపస్సుకాదు. తపస్సు అంటే మీ దేహప్రారబ్ధంలో ఏదైనా కష్టం వస్తే అంటే మీ ఇంట్లో మిమ్మల్ని మాటలు అంటున్నారు అనుకోండి, గాలివానల వలన ఇబ్బందులు వస్తున్నాయి అనుకోండి, ఏదైనా పంటలకు నష్టం వస్తోంది అనుకోండి ఏ రకమైన కష్టం వచ్చినా, ఆ కష్టాన్ని, ఆ నష్టాన్ని నువ్వు సహించుకోగలిగితే దానికి మించిన తపస్సు లేదు అని శాస్త్రంలో చెప్పాడు. తుకారామ్ గయ్యాళి భార్యతోటి కాపురం చేసాడు. తుకారామ్ భార్య కొట్టేది. భార్య కొడితే తుకారామ్‌ని పిల్లలు కూడా కొట్టేసేవారు. తుకారామ్ ఎక్కడికో హిమాలయ పర్వతాలలోకి పారిపోలేదు. ఇంట్లోవారు పెట్టిన బాధలు, సమాజపరంగా వచ్చిన బాధలు, ప్రకృతిరీత్యా వచ్చిన బాధలు ఏది వచ్చినా ఇష్టంతోటి సహించాడు. ఆ సహించటంకంటే మించిన తపస్సు ఏమైనా ఉందా? అలా సహించాడు కాబట్టి తుకారామ్‌కి వైకుంఠంలోకి వెళ్ళటానికి విమానం పంపారు. మనం చచ్చాక చివరకు నరకానికి వెళతాము. మీకు ఏమైనా ఇబ్బందులు వస్తే ఆ ఇబ్బందుల్ని ఎంతవరకూ మీరు సహించకలుగుతున్నారు, మీరు సహించకలిగితే అది కూడా తపస్సే. సహించగలగాలి, సహనం ఉండాలి. సహనం మనకు ఎవరికీ లేదు. సహనం లేకుండా ఆత్మజ్ఞానాన్ని ఎలా ఆశిస్తావు? మీకు సహనం లేకపోతే లోతులు పెరగవు. మీ హృదయం యొక్క లోతులు పెరగకపోతే మీకు జ్ఞానం రాదు.

మీరు ఇతరులకు ఏదైనా సహాయం చేయగలిగితే చెయ్యండి. భగవంతుడు మీకు ఏ గిఫ్ట్ అయితే ఇచ్చాడో అవి మీతోటివారికి ఉపయోగించండి. ఇతరుల క్షేమం కోసం ఎంతోకొంత కృషిచేయండి, మాట సహాయం చేయండి, ద్రవ్య సహాయం చేయండి, మీకు ఏది అయినా పలుకుబడి ఉంటే ఆ పలుకుబడి పదిమందికి ఉపయోగించండి. నీకు జపం ఏ ఫలితం ఇస్తుందో, ధ్యానం ఏ ఫలితం ఇస్తుందో ఇది కూడా అంతే ఫలితం ఇస్తుంది. నీకు ఏమైనా అవకాశాలు ఉంటే ఇతరులకి చేతనైనంత వరకు సహాయం చెయ్యి, నిన్ను భగవంతుడు కరుణిస్తాడు. ఈ సృష్టిలో మనది అంటూ ఏమీ లేదు. మనకి దేహభావన ఉంది కాబట్టి మనది అనుకుంటున్నాము. నీకు ఎవరు ఇచ్చారు? దేవుడు ఇచ్చాడు. మళ్ళీ ఇచ్చేటప్పుడు కూడా దేవుడు అనుకునే ఇవ్వాలి. గుడిలో హారతి పళ్ళెంలో నువ్వు పది పైసలు ఏ భావనతోటి వేస్తున్నావో ఆ భావనతోటే సృష్టికి కూడా చెయ్యి. దేవుడే ఈ ప్రపంచ రూపంలో

కనిపిస్తున్నాడు. అందుచేత నువ్వు ప్రపంచంలో ఏది చేసినా దైవపూజే. కొంతమంది ఎప్పడు చనిపోదామా అనుకుంటారు, డబ్బున్నవాళ్లే ఎక్కువగా అలా అనుకుంటారు వారికేవో బాధలు ఉంటాయి. భగవంతుడు ఇంక ఎన్ని రోజులు ఉంచుతాడు, చనిపోతే బాగుండును అని అనుకుంటూ ఉంటారు. వారికి ప్రపంచం చేదుగా కనిపిస్తోంది. మీరు అలాగ అనుకోనక్కరలేదు. ఈ ప్రపంచం అంతా ఈశ్వరుడి స్వరూపమే అని మీకు అనుభవం కనుక వస్తే ఈ ప్రపంచం చేదుగా ఉండదు, పుల్లగా ఉండదు. చాలా తియ్యగా ఉంటుంది. ఎంత తియ్యగా ఉంటుంది అంటే మీకు వైకుంఠంలో కూడా ఆ సుఖాన్ని పొందలేరు. అప్పడు ఏమనుకుంటారంటే ఈ ప్రపంచంలో చిరకాలం ఉండాలనుకోరు వెళ్లిపోవాలని అనుకోరు. అంతర్యామిగా ఉన్నటువంటి ఈశ్వరుడు మీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఇదంతా ఈశ్వరస్వరూపంగానే మీకు కనిపిస్తుంది. నీ లోపల ఎవడు ఉన్నాడో వాడే బయట అంతటా వ్యాపించి ఉన్నాడు అనేటువంటి విషయం మీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఈలోకం చాలాతియ్యగా ఉంటుంది.

మీరు చేసే మంచి కార్యక్రమం వల్ల మీ మనస్సు పెరగకూడదు, మీరు బాగుపడాలి. మనం మాట్లాడేమాట వలన, మనం చేసేపని వలన మనకి అంతఃకరణ శుద్ధి రావాలి. మనకి లోపల ఒక ఆలోచన ఉంటుంది, నోటితో వేరొకటి చెబుతాము. ఇలా చేస్తూ ఇతరులను మాయ చేస్తున్నాము అనుకుంటున్నాము కాని మనలను మనం మాయ చేసుకుంటున్నాము, మనకి మనమే అపకారం చేసుకొంటున్నాము అనే బుద్ధి కూడా మనకి రావటంలేదు. రామకృష్ణుడిని ఎవరైనా పరీక్షపెట్టటానికి వస్తే ఏమిటి నన్ను పరీక్ష పెట్టటానికి వచ్చారు అని అనుకునేవాడుకాదు. అమ్మా నన్ను ఇంకా పరిశుద్ధుడను చేయటానికి ఈ పరీక్ష పెట్టేవాళ్లని పంపిస్తున్నావా నువ్వు, లేకపోతే వీరిని ఎందుకు పంపిస్తావు అమ్మా అనేవాడు. అంటే పరిపూర్ణ శరణాగతి. రామకృష్ణుడికి సంకల్పమంటూ లేదు, వికల్పమంటూ లేదు. భగవంతుడు ఇష్టమే ఈయన ఇష్టం, ఆయన సంకల్పమే ఈయన సంకల్పం. రామకృష్ణుడిలో నేను అనే తలంపు వెదికినా కనబడదు. ఆయన నిష్కపటి. ఆయనకు అన్నం లేదు అనుకోండి, అన్నంలేదు ఆకలి వేస్తోంది అని అడగడు, తిండిలేకుండా వీడు బాధపడుతున్నాడు అని అనుకుంటారేమో అని కూడా ఆయనకు ఉండదు, అంతకపటంలేని మనిషి.

సూర్యుడు వెలుతురుని ఇస్తాడు. మబ్బు అడ్డువచ్చింది అనుకోండి, ఆ మబ్బు మనకి వెలుతురు రానివ్వదు. అలాగే మీలో చాలామంది మంచివారు ఉన్నారు. మీరు పూర్వజన్మలలో

చేసుకున్న కర్మల్లోంచి వచ్చిన దోషాలు మిమ్మల్ని పీడిస్తూ ఉంటాయి, మన లోపల జ్ఞాన సూర్యుడు ఉన్నప్పటికీ ఆయన మనకు కనబడకుండా చేస్తాయి. అప్పుడు మనం కంగారు పడకూడదు, మనం సాధన చెయ్యగా, చెయ్యగా, ఈశ్వరుడి మీద ప్రేమ పెంచుకుంటూ, ప్రీతి పెంచుకుంటూ ఉంటే నీ ఇష్టమే నా ఇష్టం అనే సంకల్పాన్ని పెంచుకోగా, పెంచుకోగా మేఘం తప్పకున్నవెంటనే సూర్యుడు మనకి ఎలా గోచరిస్తాడో అలాగే ఏదోరోజున మీ దోషాలు తప్పకుంటాయి, మీ ప్రారబ్దం తప్పకుంటుంది. మీ లోపల ఉన్న జ్ఞానసూర్యుడు మీకు గోచరిస్తాడు. ఏమిటి మనకి ఇంకా జ్ఞానం రావటంలేదు, ఆత్మసుఖం అందటంలేదు అని తొందరపడకండి. పూర్వకర్మల్లోంచి వచ్చిన దోషాలు కొంతకాలం పీడిస్తాయి, పీడించిన తరువాతపోతాయి. అవి పోయిన తరువాత నిజస్వరూపం మీకు వ్యక్తమవుతుంది. ఈలోపు మనం సహనంగా ఉండాలి. మన ప్రయత్నం మనం జాగ్రత్తగా చేసుకొంటూవెళ్ళాలి, తరువాత కాలం కలిసిరావాలి, వీటితోపాటు ఈశ్వరానుగ్రహం ఉండాలి. ధ్యాన నిష్ఠ, ఆత్మనిష్ఠబాగా నిలబడటానికి మనం సత్‌కర్మ చెయ్యాలి. ఏదీ ఆశించకూడదు. మీరు మంచికర్మలు చేసి గౌరవం రావాలంటే గౌరవం వస్తుంది కానీ ధ్యాననిష్ఠ, ఆత్మనిష్ఠ రాదు. ఆత్మనిష్ఠ లేకుండా మీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మసుఖం ఎలా తెలుస్తుంది.

అద్దం మసిపడితే అద్దంలో మన ముఖం సరిగ్గా కనబడదు. అద్దం బాగా శుభ్రం చేస్తే అప్పుడు అద్దంలో మన ప్రతిబింబం చాలాచక్కగా కనిపిస్తుంది. అలాగే నీ మనస్సు అనే అద్దాన్ని బాగా స్వచ్ఛంగా చేసుకో, బాగా నిర్మలంగా చేసుకో. మనస్సు అనే అద్దం స్వచ్ఛంగా ఉంటే లోపల ఉన్న సద్వస్తువు నీకు ఎంతో స్పష్టంగా గోచరిస్తుంది. సాధన దేనికోసం? మనస్సుని బాగుచేసుకోవటానికే సాధన. లోపల ఉన్న ఆనందం మనకి అందటంలేదు అంటే మనస్సులో ఎక్కడో తేడా ఉంది. మనస్సులో ఉన్న తేడాని తొలగించుకుంటే లోపల ఉన్న ఆనందం అందుతుంది. మీ మనస్సు అనేది ఒక అవకరం. మనోనాశనం అయ్యేవరకూ లోపల మీకు ఆనందం ఉన్నా అందదు. మనోనాశనం చేసుకోలేక, మనస్సుని వాసనాక్షయం చెయ్యలేక లోపల ఆనందమే లేదు, లోపల భగవంతుడు లేడు అని అనుకుంటున్నావు. మనస్సు అనే అవకరంపోతే లోపల ఉన్నటువంటి జ్ఞానగంగ వెంటనే మన సహస్రారానికి అందుతుంది. అప్పుడు లోపల ఉన్న సుఖం మనకు అందుతుంది. ఏ లౌకికసుఖం ఈ సుఖంతోటి సమానంకాదని, ఏ ఇంద్రియసుఖం ఈ సుఖంతోటి

సమానంకాదని పైగా అది స్వచ్ఛమైనది అని అప్పుడు మనకి అనుభవంలోనికి వస్తుంది. మనల్ని ఏ వాసన పీడిస్తోంది, ఏ కోరిక మనల్ని పీడిస్తోంది, ఏ తలంపు వల్ల మనం లోకానికి బంధింపబడుతున్నాము అని జాగ్రత్తగా మనల్ని మనం విశ్లేషణ చేసుకోవాలి. అది చూసుకుని ఆ వాసనతోటి మనకి వియోగం కావాలి. ఆ వాసనను స్లోగా, స్టడీగా వదిలించుకోవాలి. వాసన బలీయంగా ఉన్నప్పుడు దానిని బయటకి గెంటలేము అనిపిస్తుంది. దేహగతమైననేనుని బయటకి గెంటికాల్చి బూడిద చేస్తేనేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు.

నువ్వు ఒక విషయం మరచిపోకు. నువ్వు పుట్టింది మొదలు చనిపోయేవరకు ఏ పని చేసినా నేను కోసమే చేస్తావు. మీ లోపల ఉన్న నేనుకి ఎవరైనా అపకారం చేసారనుకోండి వాడిని వదిలేస్తారు. మీ ఇంట్లో వారు అనుకూలంగా లేరు అనుకోండి, వారికి మానసికంగా దూరమైపోతారు. దీని అర్థం ఏమిటి అంటే ఆ మనిషి పుట్టినా, జీవించినా, ఆ మనిషి ఏ పని చేసినా ఆ నేను కోసమే చేస్తాడు. ఆ నేనుని ఊడగొట్టుకునేవరకూ వాడు జ్ఞానానికి అర్హుడుకాదు, వాడికి జ్ఞానానికి యోగ్యత రాదు. ఆ నేను అనేది నిజంగా లేనేలేదు కానీ నువ్వు ఉందని అనుకుంటున్నావు. లేని నేనుని లేదని తెలుసుకోవటమే జ్ఞానం. రామకృష్ణ పరమహంసగారు ఏమి చెప్పారు అంటే కాలువలో నీరు వెడుతూ ఉంటే ఒక కఱ్ఱను ఆ నీటిలో వెయ్యమన్నారు. ఆ కఱ్ఱ కాలువలో వెడుతూ ఉంటే మనకి ఏమనిపిస్తుందంటే కఱ్ఱకు ఆ పక్క నీరు వేరు, ఈ పక్క నీరు వేరు అనిపిస్తుంది. కాని నీరు అంతా ఒక్కటే. అలాగే మొత్తం అంతా ఒకటే అయినా మనస్సు ఉండటం వలన వారు వేరు, నేను వేరు అనే బేధబుద్ధిని నీ మనస్సు తీసుకువస్తోంది, నువ్వు ఏ సాధన చేసినా ఆ మనస్సుని తొలగించుకోవటానికే ప్రయత్నం. ఈ లోపులో మహిమలు గొడవల్లోకి వెళ్లకు. మహిమల గొడవల్లోకి వెడితే నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనస్సు ఏ కారణం వలన బాహ్యముఖానికి వస్తోందో ఆ కారణాన్ని కత్తిరించటమే సాధన యొక్క గమ్యం. భగవంతుడు చెప్పిన మాటని ప్రమాణంగా తీసుకుంటే మనం బాగుపడతాము. శాస్త్రం చెప్పినట్టు మనం నడిస్తే మనకి తెలియకుండానే మనోనాశనం అవుతుంది.

మంచివాళ్లకే ఎక్కువ కష్టాలు వస్తున్నాయి ఏమిటి అని కొంతమంది అంటారు. ఎందుకు ఎక్కువ కష్టాలు వస్తాయి అంటే భగవంతుడికి ఎవరిమీద అయితే అనుగ్రహం కలిగిందో, భగవంతుడి దయ అనే వర్షం ఎవరి శిరస్సుమీద అయితే వర్షిస్తుందో అప్పుడు భగవంతుడు ఏమి చేస్తాడు అంటే రాబోయే వెయ్యి జన్మల్లో అనుభవించవలసినటువంటి

కర్మని ఒకే జన్మలో అనుభవింపచేసి వాటిని తీసేసి మీకు మోక్షాన్ని ఇస్తాడు. మానవుడికి అసాధ్యం ఉందికాని, భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీలేదు, ఆయనకు అన్నీ సాధ్యమే. మీరు మాట్లాడుతున్నారు అనుకోండి ఆ మాట హార్ట్‌ఫుల్‌గా మాట్లాడుతున్నారా, ఊరికే నటనకోసం మాట్లాడుతున్నారా అనేది తెలుస్తూ ఉంటుంది. ఆ మాటకి తూకం ఎప్పడు వస్తుంది అంటే మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని టచ్ చేసి ఆ మాట కనుక వస్తూ ఉంటే ఆ మాట మీకు లోచూపు కలుగజేస్తుంది. మాట దేవుడై ఉంది. నీ లోపల ఏదైతే ఉందో అది అయ్యి నువ్వు చెబుతూ ఉంటే ఆ మాట కూడా దేవుడితోటి సమానం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-08-2009, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ ప్రారబ్దాన్ని బట్టి భగవంతుడు మీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని నువ్వు శ్రద్ధగా, భక్తిగా చేయటమే ఆయనకు పెట్టే నిజమైన నమస్కారము. కర్మ సన్యాసం కంటే కర్మయోగం మంచిది అని భగవంతుడు చెప్పాడు. బద్ధకస్తులకు వారి శరీరయాత్ర నడవటంకూడా కష్టమవుతుంది. స్వయంకృషి ఉండాలి, దేవుని కృప ఉండాలి. మీరు ఏదైనా విషయంలో అభివృద్ధిలోనికి వస్తే అదంతా మీ తెలివిఅనుకోకూడదు. మీ ప్రయత్నం మీరు చేసారు, భగవంతుడు అనుగ్రహించాడు. మనకంటే కష్టపడేవారు ఉన్నారు, ఒకోసారి వారికి కలిసిరాకపోవచ్చు. దానికి ఈశ్వరునిదయ ఉండాలి. ఈశ్వరనిర్ణయం ఎలా ఉంటుందో మనం చెప్పలేము. మీ అనుగ్రహం కావాలి అని అమలాపురంలో ఒకరు అడిగారు. మా అనుగ్రహం ఏమిటండీ, అహంకారం ఏమి అనుగ్రహిస్తుంది, జ్ఞానం అనుగ్రహించాలి అని చెప్పాను. గ్రహంఅనే మాటకు పట్టుకోవటం అనిఅర్థం. సర్వకాలసర్వావస్థలలో ఈశ్వరుని పాదాలను ఎవడైతే పట్టుకొని వేలాడుతున్నాడో వాడికి ఆయన అనుగ్రహం వస్తుంది. మీరు ఈశ్వరుని అంటిపెట్టుకొని ఉండండి, ఆయన ఏదో టైములో మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. మీరు చేసిన కృషి ఊరికేపోదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి పెట్టుబడి ఏమిటి అంటే పవిత్రత ఉండాలి. నామాన్ని శ్రద్ధగా చేయటంవలన మన మనస్సు పవిత్రం అవుతుంది. బాహ్యంగా మనకు ఎన్ని సదుపాయాలు ఉన్నా పవిత్రుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

మీరు భగవద్గీత చదివితే సరిపోదు, మీ ప్రవర్తన నాకు సమ్మతంగా ఉంటేనే నా అనుగ్రహం మీకు వస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసుకొని

మా ప్రవర్తన బాగానే ఉంది, మేము అన్ని విధాలా బాగానే ఉన్నాము అని మీ అంతట మీరే డప్పు కొట్టుకుంటే ఎలాగ? మన ప్రవర్తన మన అహంకారానికి అనుకూలంగా ఉంది కాని ఈశ్వరునికి సమ్మతంగా లేదు. నువ్వు ఎవరిగురించి అయితే దుఃఖపడకూడదో వారి గురించి దుఃఖపడుతున్నావు, వారి గురించి దుఃఖపడవలసిన పనిలేదు, వారు చనిపోతారు అంటావు ఏమిటి? నువ్వు వారిని చంపటం ఏమిటి? నువ్వు ఎవరి గురించి అయితే దుఃఖపడుతున్నావో, ఎవరైతే చనిపోతారు అని నువ్వు భయపడుతున్నావో వారందరిని ముందే నేను చంపి ఉంచాను. నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్, నువ్వు ఊరికే బొమ్మలాగ నిలబడు, చేతులు ఆడించు, పనంతా నేనే చేస్తాను అని పరమాత్మ చెప్పాడు. మీరు ఎవరైనా బాగుపడ్డారు అనుకోండి, మీ తెలివితేటల వలన బాగుపడటంకాదు, ఈశ్వరుడు మీకు ఆ సంకల్పం కలుగచేసాడు కాబట్టి బాగుపడ్డారు కాని అందులో మీ తెలివితేటలు ఏమీ లేవు. నీ తెలివితేటలను ఉపయోగించి తెల్లబడిపోయిన ఒక్క వెంట్రుకను నల్లగా చేసుకోగలవా అంటాడు ఏసు. మనం బొమ్మలం, మనం యంత్రాలం, లోపల ఉండి ఈ యంత్రాలను ఆడించేవాడు ఆయనే. ఈశరీరంలో అంతర్యామిగా నారాయణుడు ఉండి ఈ శరీరాన్ని ఆడిస్తూ ఉంటాడు.

రమణమహర్షిగారు తల్లితో ఏమని చెప్పారు అంటే ఈ శరీరం ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉండాలో, ఈ శరీరం ద్వారా ఏ పని జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది, అది పూర్తి అయిన తరువాతగాని ఈ జీవుడిని ఈశ్వరుడు తీసుకొనిపోడు. జరగవలసినది జరిగేతీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయం, దీని గురించి దుఃఖపడవలసిన పని లేదు అని చెప్పారు. ఈ లోకానికి ఒక ప్రభువు ఉన్నాడు, నడిపేవాడు ఆయనే అని పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. మనం విశ్వాసంగా ఉండాలి అనుకొన్నప్పటికీ లోపల పవిత్రత లేకపోతే, లోపల శుచి లేకపోతే విశ్వాసం నిలబడదు. సాధ్యమైనంతవరకు బాహ్యంగా అందరూ శుచిగానే ఉంటారు గాని లోపల శుచి ఉండదు. బాహ్యంగా శుచిగా ఉండటం మంచిదేగాని లోపల శుచి ముఖ్యం. మేము పవిత్రులం అని మీరు అనుకుంటే సరిపోదు. మీ లోపల ఉన్న రహస్యాలు అన్నీ భగవంతుడికి తెలుసు. ఎత్తటానికి వీలులేని బరువైన రాళ్ళు ఏవైతే మీ హృదయంలో ఉన్నాయో, ఏ బాధలు మీ హృదయంలో ఉన్నాయో అవి లోకానికి తెలియకపోయినా, మీ లోపల ఉన్న భగవంతుడికి తెలుసు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం మీకు లేకపోతే మీరు ముందుకు వెళ్ళలేరు. మీరు డబ్బు పెట్టి మంచం కొనుక్కోగలరుగాని నిద్రను

కొనుక్కోలేరు. డబ్బుపెట్టి యజ్ఞాలు, యాగాలు చేయగలరు, యాత్రలకు వెళ్ళగలరు గాని డబ్బుపెట్టి మోక్షాన్ని, శాంతిని పొందలేరు. డబ్బువలన మీకు శాంతిరాదు, అణిగిన మనస్సుకి శాంతి దొరుకుతుంది.

భక్తుడు సాధనలో ఎలా ఉండాలి అంటే ప్రారబ్ధాన్ని బట్టి మనలను అదృష్టం వెంటాడుతూ ఉంటుంది, దురదృష్టం వెంటాడుతూ ఉంటుంది, దేహప్రారబ్ధంలో హెచ్చుతగ్గులు ఉంటాయి, ప్రారబ్ధం మిమ్మల్ని అటూఇటూ ఊపుతున్నప్పటికీ, ఈశ్వరుని పాదాలమీద మీకు ఉన్న విశ్వాసాన్ని ఊగనివ్వకూడదు. సర్వసాధారణంగా మనకు కోరికలు నెరవేరుతూ ఉంటే ఒకరకంగా ఉంటాము, కోరికలు నెరవేరకపోతే గురువును వదిలేస్తాము, దేవుడిని వదిలేస్తాము. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు ఎవరి జీవితం సమానంగా ఉండదు, ప్రారబ్ధాన్నిబట్టి హెచ్చుతగ్గులు ఉంటాయి, వాటిని నీవు భరించాలి, వాటిని తట్టుకొంటూ ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే వాడు నిజమైన భక్తుడు. వాడు క్వయిట్‌గా ఉంటాడు, కూల్‌గా ఉంటాడు, వాడు చేసే పని ఏదో చేస్తాడు, గుర్తింపులు కోరుకోడు. మనం ఇంపెర్సనల్‌గా పనిచేయాలి. మంచి వచ్చినా, చెడ్డవచ్చినా ఈశ్వరసంకల్పం అలా ఉంది అనుకోవాలి, అదీ మాయే, ఇదీ మాయే. మాయలో నుండి బయటకు రాలేకపోతే ఈశ్వరదర్శనం ఎలా సాధ్యమవుతుంది.

జ్యోతిరామలింగస్వామి ఏమన్నారు అంటే ఓ పరమేశ్వరుడా! నేను ఈ లోకానికి గాని, పరలోకానికిగాని సంబంధించినవి ఏమీ నిన్ను అడగటంలేదు, నువ్వు ఒక్కడివే నాకు కావాలి అని అడుగుతున్నాను. నేను పదికోరికలు కోరితే ఇవన్నీ ఎక్కడ తీర్చగలను పోవయ్యా అని అనవచ్చును, నేను పది కోరికలు కోరటంలేదు, నాది ఒక్కటే కోరిక. నువ్వు తప్పించి నాకు ఏమీ అక్కరలేదు, నువ్వు నాకు లభిస్తేచాలు, ఇంక అడగటానికి కోరికలు నాకు లేనేలేవు అన్నాడు. ఒకసారి భగవాన్ ఏమన్నారు అంటే అందరూ మాకు డిగ్రీలు ఉన్నాయి, మాకు డిగ్రీలు ఉన్నాయి అంటున్నారు, నాకు కూడా ఒక డిగ్రీ ఉందివయ్యా అది ఏమిటి అంటే ఏమీ పనిలేనివాడు అంటే అహంభావనే లేనివాడు, దేహభావన లేనివాడు చేసినా చెయ్యనివాడితో సమానం. వీరు ఎవరు అంటే మా భర్త, వీరు ఎవరు అంటే మా అత్తగారు, వీరు ఎవరు అంటే మా అమ్మగారు అంటాము, ఈ సంబంధాలు ఉన్నాయికదా అంటే ఇవన్నీ మానవతా సంబంధాలు, ఇదంతా మనో కల్పితం, ఎవరూ ఎవరికీ ఏమీకారు. చైతన్యానుభవం వచ్చాక భర్త ఎవరు, అత్తగారు ఎవరు, అమ్మ ఎవరు, ఏమీలేదు. అసలు సంసారం అంతా

మనోకల్పితం. అయితే నీకు ఎందుకు నిజం అనిపిస్తోంది అంటే అదే మాయ. మాయ ఎక్కడ ఉంది, మనస్సులో ఉంది. అందుచేత మనస్సుతోటి ఆలోచించేది, మనస్సుతోటి చూసేది, మనస్సుతోటి వినేది ఏదీ నిజంకాదు. జ్ఞానికి చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీలేదు.

శరీరాన్ని బట్టే చుట్టాలు, మనస్సునుబట్టే స్నేహాలు, విరోధాలు అని శాస్త్రంలో చెప్పాడు. అంత గొడవ ఎందుకు నీ క్షేమం కోరేవాడు ఎక్కడ ఉన్నా వాడే నీ చుట్టం, వాడే నీ స్నేహితుడు అని చాణక్యుడు చెప్పాడు. మనం ఎప్పుడు పాడైపోతామా అని కనిపెట్టుకొని ఉండేవారు చుట్టాలు ఎలా అవుతారు, స్నేహితులు ఎలా అవుతారు. అక్క చెల్లెలు ఉన్నారు అనుకోండి. అక్క క్షేమం చెల్లెలుకోరదు, చెల్లెలు క్షేమం అక్క కోరదు అనుకోండి, ఎందుకు వచ్చిన చుట్టరికాలు అవి, ఇటువంటివి అన్నీ మీ తలకాయలో ఎందుకుమోస్తారు. బాహ్యంగా ఏమీ చేయలేకపోయినా అసలు మనస్సులో అయినా నీ క్షేమం కోరనివాడు నీ చుట్టముకాదు, వాడు నీ స్నేహితుడు కాదు. ఏసుక్రీస్తు ఏమని చెప్పాడు అంటే ఎవడైతే దేవుడు చెప్పిన పని చేస్తున్నాడో వాడే నా చుట్టం, వాడే నా స్నేహితుడు, వాడే నా సోదరుడు, మిగతావారితో నాకు సంబంధం లేదు అని చెప్పాడు. సైతాను చెప్పిన పనులు చేసేవారు నాకు చుట్టాలు ఎలా అవుతారు అన్నాడు. భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మనం కాలాన్ని బాగా సద్వినియోగం చేసుకోవాలి. పరమేశ్వరుడు గురించి శ్రవణం చేయాలి, ఆయనను మననం చేసుకోవాలి, ఆయన గురించే ఆలోచించాలి, భగవంతుడిని తెలుసుకోవాలనే కాంక్ష ఎవరి సమక్షంలో మనకు కలుగుతుందో వారి సమక్షాన్ని కోరుకుంటూ ఉండాలి. మీకు ఎవరికైనా బెంగలు ఉంటే అవే చివరకు బరువులకింద తయారవుతాయి, బెంగల గొడవ ముందు వదిలేయండి. ఎవరి గురించి ఏడవకూడదో వారి గురించి ఏడుస్తావేమిటి అన్నాడు పరమాత్మ. ఈ ఒక్క వాక్యం మనకు గుర్తుంటే చాలు. భగవంతుడిని వదిలేసి హృదయంలో వారిని మోస్తావు ఏమిటి? హృదయంలో భగవంతుడికి స్థానం ఇవ్వకుండా వారికి స్థానం ఇస్తావు ఏమిటి?

ఈ శరీరం ఉండగానే, ఈ శరీరం శవం అవ్వకముందే కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం, భయం యొక్క వేగం, అసూయ యొక్క వేగం తగ్గించుకో. దేనికి భయపడవద్దు అని ఎందుకు చెపుతున్నారు అంటే భయం నీ సుఖానికి అడ్డు వస్తుంది. కోపం నీ సుఖానికి అడ్డు వస్తుంది, అసూయ నీ సుఖానికి అడ్డు వస్తుంది. అవి నీ సుఖానికి

అడ్డు వస్తున్నాయి కాబట్టి వాటిని తొలగించుకోమని చెపుతున్నారు. ఇవన్నీ తొలగించుకొంటే అప్పుడు నువ్వు సుఖపడతావు. ఇది మంచి, ఇది చెడ్డ అని మీ హృదయం చెపుతూ ఉంటుంది. మనం ఏదైనా పొరపాటు చేస్తూ ఉంటే ఇది పొరపాటు అని మన హృదయం చెపుతూ ఉంటుంది. ఇక్కడ మాటలు అక్కడ, అక్కడ మాటలు ఇక్కడ చాడీలు చెపుతున్నారు అనుకోండి, అది తప్ప అని హృదయం చెపుతూనే ఉంటుంది. హృదయం చెప్పినట్లు వినకుండా అలా మీరు ఎందుకు చేస్తూ ఉంటారు అంటే అలవాట్ల యొక్క వేగాన్ని బట్టి అలా చెప్పేస్తూ ఉంటారు. అందుచేత మీరు హృదయం చెప్పినట్లు వింటే అజ్ఞానం నుండి బయటకు వచ్చేస్తారు అని ఐన్‌స్టీన్ చెప్పాడు. మీ అత్తగారిని మీరు చూడాలి అనుకోండి. అత్తగారిని చూడటం మీ ధర్మం అని హృదయం చెపుతూ ఉంటుంది. చూడటం మీకు ఇష్టంలేదు అనుకోండి ఏదో రీజన్ చెప్పటానికి మీ తలకాయ ఉపయోగపడుతుంది. పని నుండి తప్పించుకోవటానికి మీ తలకాయ బోలెడంత రీజన్ చెపుతుంది. ఇది కోర్టులో జడ్జిగారికి చెప్పటానికి పనికి వస్తుంది గాని దేవుడి దగ్గర ఎక్కడ పనికివస్తుంది. మీ తలకాయ మీకు పాడైపోయే లక్షణాలు కూడా చెపుతూ ఉంటుంది. హృదయంలో నుండి ప్రేమ తప్పించి, శాంతి తప్పించి, తత్వం తప్పించి ఏమీరాదు. మీ తలకాయలో నుండి అశాంతి వస్తుంది. ఒక మంచి పని చేయటం కూడా మీకు ఇష్టం లేకపోతే దానికి ఏవో కారణాలు కల్పించి చెప్పటానికి మీ తలకాయ ఉపయోగపడుతుంది.

మీరు మంచిపనులు చేస్తున్నారు అనుకోండి, ఆ మంచిపనులు చేయటమే మన గమ్యంకాదు, మంచిపనులు చేయటం వలన మీకు చిత్తశుద్ధి కలగాలి, మీకు జ్ఞానోదయం కలగాలి, మిమ్మల్ని ఎవరైనా తిడుతూ ఉంటారు. కారణం లేకుండా అందరూ మనలను తిట్టేస్తున్నారు అని మీరు కంగారుపడతారు. ఏదో అసూయవలన తిట్టవచ్చు. అందరూ మిమ్మల్ని తిట్టటం మంచిదే, అది తెలియక మీరు కంగారుపడుతున్నారు. అలా తిట్టటం వలన మన పొగరుబోతుతనం తగ్గుతుంది, వ్యక్తిభావన తగ్గిపోతుంది. తిట్టినవారికి నోరు నొప్పిగాని మీకు నోరు నొప్పిలేదు కదా. మీలో ఉన్న అజ్ఞానం పోవటానికి ఒకరకంగా వారు సహకరిస్తున్నారు అది వారికి తెలియదు. మంచివారు ఇంకా మంచివారుగా అవ్వటానికి చెడ్డవారి పాత్ర కూడా సమాజంలో అవసరమే. నీ శరీరానికి రోగం వచ్చింది అనుకో, ఇది నా శరీరం కాదు అని నువ్వు వదులుకొంటున్నావా? లేదు. ఎంతోజాగ్రత్తగా శరీరాన్ని చూసుకొంటున్నావు. నీకు ఉపయోగపడని బంధువుల విషయంలో, ఉపయోగపడని స్నేహితుల విషయంలో కూడా అలా

జాగ్రత్తగా ఉండు. వారు నీ కాలాన్ని వృధా చేస్తారు. నువ్వు ఏదైనా సాధన చేసుకొంటూ ఉంటే దానిని చెడగొడతారు అంతకంటే వారు నీకు ఏమీ ఉపయోగపడరు.

యుక్తుడు అంటే నిగ్రహం కలవాడు. నిగ్రహం కలవాడు, సహనం కలవాడు ఏదైనా విషయంలో తాత్కాలికంగా ఓడిపోయినట్లు కనిపించినా, వారే విజయం సాధిస్తారు. కామక్రోధాల వేగం నిగ్రహించుకోవటం చాలా కష్టం. పూర్వజన్మలో మీరు చేసిన కర్మను బట్టి వాటి వేగం ఉంటుంది. మీరు ప్రయత్నం చేస్తూ ఉండాలి. మీకు పూర్వపుణ్యం ఉంటే మీ ప్రయత్నం తొందరగా ఫలిస్తుంది లేకపోతే కొంతటైము పడుతుంది అయినా మనం ప్రయత్నం మానకూడదు. నేను అనే తలంపు హృదయంలో నుండే వస్తుంది. నేను అనే తలంపు ఎక్కడ ఉదయించి వస్తోందో అక్కడే పరమాత్మ ఉన్నాడు, అక్కడే ఆనందం ఉంది, అక్కడే శాంతి ఉంది. ఈ నేను అనే తలంపును ప్రశ్నించి, దానిని విచారించి అది ఏ హృదయంలోనుండి అయితే ఉదయించి వస్తోందో అక్కడకు ఉపసంహరించ గలిగితే ఈ నేను అనే తలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అప్పడు అంతటా వ్యాపించి ఉన్న నేను నీకు అనుభవంలోనికి వస్తుంది. అప్పడు ఎటు చూసినా నీకు శాంతే, ఎటుచూసినా ఆనందమే. ఇంత వివరంగా చెపుతూ ఉంటే ఆ మాటలను మనం అందుకోవటానికి సిద్ధంగా లేము. మనం శుభ్రంగా పాడైపోయి ఉన్నాము, మన బుద్ధి పాడైపోయింది, మనం ఎవరినీ తిట్టకపోయినా, కొట్టకపోయినా ఇంచుమించుగా చాలామంది పిచ్చివారితో సమానము. ఇతరుల క్షేమం కోరి మనం ఏవైనా మంచి మాటలు చెప్పినా వాటిని అర్థం చేసుకొనే శక్తి వారికి లేనప్పడు మనలను కూడా వారు విరోధులు అనుకొంటారు.

ఎదుటివారు నీతో మాట్లాడుతూ ఉంటే వారి హృదయం, వారి మనస్సు నీకు కొంత తెలుస్తూ ఉంటుంది, వారు మంచివారు కాదు అని నీకు తెలుస్తున్నా, వారు బాహ్యంగా దేనికైనా నీకు ఉపయోగపడతారు అని అనుకొంటావు అనుకో వారిని పట్టుకొని వేలాడుతూ ఉంటావు, వారిని విడిచిపెట్టలేవు. అంటే హృదయం చెప్పిన దానిని వదిలేసి నీ తలకాయ చెప్పినట్లు పోతూ ఉంటావు. మీ మావగారు మంచివారు కాదు అని తెలిసినప్పటికీ ఆయన దగ్గర నుండి ఏదైనా ఆస్తి కలిసివస్తుంది అంటే ఏదో అలా కాలక్షేపం చేస్తూ ఉంటావు. అంటే హృదయం చెప్పిన దానికి వ్యతిరేకంగా మీ అవసరాలనుబట్టి తలకాయచెప్పిన ప్రకారం పోతూ ఉంటావు. నీకు ఇష్టంగా ఉన్నప్పడు ఒకరకంగా ఉంటావు, ఇష్టంలేనప్పడు

వేరొకరకంగా ఉంటావు. నీకు ఇష్టం ఉంటే ఏదో పెద్దాయన కదండి, ఏదో అంటూ ఉంటారు, రాజీపడాలి అని చెపుతారు. ఇష్టంలేనప్పడు ఆయన మాటలు మీరు పడరు. ఇదంతా తలకాయ గొడవేకాని హృదయంలో ఇటువంటి గొడవలు ఏమీ ఉండవు. జీవకోటి యొక్క హితవు మనం కోరుకోవాలి, వారు ఎటువంటివారు అనేది మనకు అనవసరం. నాకు తప్పిపోయిన గొఱ్ఱెలు అంటే బాగా ఇష్టం అన్నాడు ఏసు. అంటే పాడైపోయినవారు అంటే ఎక్కువ ఇష్టపడతాను ఎందుచేతనంటే వారిని బాగుచేయటంకోసం. తెలివి తక్కువవారిని అన్నదమ్ములు విడిచిపెట్టేస్తారు, సమాజం విడిచిపెట్టేస్తుంది కాని తల్లి విడిచిపెట్టదు. తల్లిప్రేమ ఇంతగొప్పగా ఉన్నప్పడు ఈశ్వరప్రేమ ఇంకెంత అపూర్వంగా ఉంటుంది.

నీలోపల ఏ దోషాలు, పాపాలు, బలహీనతలు ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు పుట్టిన వారాలను, నక్షత్రాలను, తిథులను తిడుతూకూర్చోవద్దు. నీవు అభివృద్ధిలోనికి రాకుండా నీ అనుయాయులు కూడా నీకు అడ్డువస్తున్నారు, అటువంటి వారిని తొలగించుకో. వాసనలు కొన్ని వేల జన్మల నుండి అలా వస్తూ ఉంటాయి, వాటిని తొలగించుకోవటానికి తపస్సు అవసరం. వాసన లేని వాడికి తపస్సుతో పనిలేదు. తపస్సు ఫలించాలన్నా, మీ సాధనలు ఫలించాలన్నా ముందు భక్తి ఉండాలి, ఈశ్వరపాదాలపట్ల ప్రేమ ఉండాలి. ఓ శబరీ నీ భాగ్యం ఇట్టిదని, నీ అదృష్టం ఇట్టిదని ఏమని చెబుతాను అన్నాడు త్యాగరాజు. శబరికి చదువు లేదు, రాముడితో మాట్లాడుతూ రాముడిలో ఐక్యమైపోయింది. ఆవిడకు రాముడి పట్ల ఉన్న ఏకాంతభక్తి, చూస్తే రాముడిని చూడటం, వింటే రాముడి గురించి వినటం, ఆలోచిస్తే రాముడి గురించి ఆలోచించటం, అంతా రామమయం, నూటికి నూరుపాళ్ళు ఆవిడ మనస్సు రాముడి మీద నిలబడింది. మనకు ఎప్పడైనా అయిదు నిమిషాలు నిలబడుతుంది తరువాత మరల బయటకు పోతుంది ఎందుచేతనంటే లోపల ఉన్నవాసన మన మనస్సును రాముడి మీద నిలబడనివ్వదు. శబరికి రాముడి మీద ఏకాగ్రత కుదిరింది, అదే నిజమైన సంపద, శబరికి రాముడితో ఉన్న సంబంధం ఆత్మసంబంధం. దేహసంబంధాలు, మానసికసంబంధాలు ఏవీ నిలబడవు కాని ఆత్మ సంబంధం జన్మజన్మలకు అలా కంటిన్యూ అవుతూ ఉంటుంది.

మనం సాధన చేసేటప్పడు ఫెయిల్ అయిపోతూ ఉంటాము, పాస్ అవ్వటానికి

మరల ప్రయత్నం చేయాలి. సాధనలో ఫెయిల్ అవ్వకుండా ఎవడూ ఉండడు. పిల్లలు నడకనేర్చుకునేటప్పుడు అనేకసార్లు పడిపోతూ ఉంటారు, మరల లేచి నడవటానికి ప్రయత్నం చేస్తారు. ఈ ఆధ్యాత్మిక సాధన కూడా అంతే. మనం ప్రయత్నం చేస్తూ ఉండాలి, ఫెయిల్ అవుతూ ఉంటాము, మరల ప్రయత్నం చేయాలి. ఫెయిల్ అయ్యామని ప్రయత్నం మానకూడదు. బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉంటే మనం సుఖపడతాము అనుకొంటున్నాము కాని బాహ్యపరిస్థితులు అన్నీ అనుకూలంగా లేకపోయినా మనోనిగ్రహం కనుక ఉంటే నీవు ఎక్కువ సుఖపడతావు. బాహ్యంగా నీకు అన్ని కంఫర్ట్సు ఉన్నప్పటికీ మనోనిగ్రహం లేకపోతే తాటాకు ఇంట్లో ఉన్నవాడికంటే నీకు ఎక్కువ దుఃఖం వస్తుంది. మీకు మనోనిగ్రహం లేదు అనుకోండి మీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా మిమ్మల్ని ఎవరూ సుఖపెట్టలేరు. మీకు అన్నీ ఉన్నాయి, మనస్సులో శాంతి లేదు అనుకోండి, వాటిని ఏమి చేసుకొంటారు. మనస్సు శాంతిగా ఉంటే, మనస్సుకు నిర్మలత్వం వస్తే ఇంట్లో పరిస్థితులు బాగా లేకపోయినా నువ్వు హాపీగా ఉండగలుగుతావు. మీకు ఎవరినైనా చూస్తే కోపం వస్తోంది అనుకోండి అక్కడ ద్వేషం ఉంది. ఎవరినైనా చూస్తే నీకు ఇష్టం వస్తోంది అనుకోండి అక్కడ ఏదో కామం ఉంది, ఇవి రెండూ కూడా నిన్ను బంధిస్తాయి. కామక్రోధముల వేగం బలీయంగా ఉంటుంది, ఇవి మీ శాంతిని పోగొడతాయి.

ఏది మంచో, ఏది చెడ్డో నీకు తెలియదు. నువ్వు తర్కంలోనికి వెళ్ళకు. భగవంతుడు చెయ్యమని చెప్పిన పనిని చెయ్యి, ఆయన వద్దని చెప్పినది మానెయ్యి, అక్కడ నీ తలకాయ పెట్టవద్దు. ఒకడు ఎంత చెడ్డవాడు అయినప్పటికీ వాడిని ద్వేషించవద్దు అని భగవాన్ చెప్పారు. వాడిని ద్వేషించటం వలన నీకు జరిగే నష్టం ఏమిటి అంటే నీ మనస్సు బాహ్యముఖానికి పోతుంది, ఇంక దానికి అంతర్దృష్టి కలుగదు. ఈ శరీరం లేకముందు మనం ఉన్నాము, ఈ శరీరం ఉన్నప్పుడు మనం ఉంటాము, ఈ శరీరం పోయిన తరువాత కూడా మనం ఉంటాము. ఆ ఉన్నది ఎవరు, దానిని మనం అనుభవంలోనికి తెచ్చుకోవాలి. మూలతలంపు మూలంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొంటే ఇదే అంతటా వ్యాపించి ఉంది అనేది నీకు గోచరమవుతుంది. మనస్సు ఎప్పుడైతే అణిగిపోయిందో, భగవంతుడిని విడిచిపెట్టి ఏదైతే నేను, నేను అని విజృంభించి వస్తోందో అది అణిగినప్పుడు మహామౌనం వస్తుంది. ఆ మహామౌనం మీకు ఉన్న సంశయాలను ఛేధించి పాడేస్తుంది, ఆ మౌనం మీకు కుదిరితే చాలు. దక్షిణామూర్తి మౌనం వలన శిష్యులకు ఆత్మజ్ఞానం కలిగింది అని మురుగునార్ భగవాన్‌తో అంటే దానికి

భగవాన్ ఏమి చెప్పారు అంటే దక్షిణామూర్తి శిష్యులకు బోధించి, బోధించి మౌనం వహించాడు, ఆ మౌనంలో వారికి వస్తువు స్ఫురించింది అన్నారు భగవాన్.

నిజమైన భక్తులు నిర్మలంగా ఉంటారు, కూల్‌గా ఉంటారు, వారు పని చేస్తూ ఉంటారు గాని పని చేస్తున్న జాడ కనబడదు. ఈ పని నా వల్ల అయ్యింది అని చెప్పేవాడు భక్తుడు కాదు. నువ్వు ప్రయత్నం చేసావు, దానికి ఈశ్వరుడు అనుగ్రహించాడు. అది ఈశ్వరుడి వల్ల అయ్యిందికాని నీ వల్ల కాదు. నిజమైన భక్తుడివలన మీకు ఏదైనా ఉపకారం జరిగినా నా వలన జరిగింది అని అనుకోడు, ఎందుచేతనంటే నేనే చేసాను అని చెప్పటానికి అక్కడ నేను లేడు, నేను లేనప్పుడు నేను చేసాను అని ఎలా చెపుతాడు, ఆయనే చేసాడు అంటాడు. భగవాన్ ఇంకా దూరం వెళ్ళి చెప్పారు. ఓ అరుణాచలేశ్వరుడా! నీ పేరు విని, నిన్ను స్మరించి ఇక్కడకు వచ్చాను. వచ్చి నిన్ను చూసాక తెలిసింది ఏమిటి అంటే నేను లేను, నువ్వూ లేవు అని తెలిసింది. నాది జీవుడి వేషం, నీది దేవుడి వేషం, ఈ వేషాలు తీసేస్తే ఉన్నది ఒక్కటే. అది బ్రాహ్మీస్థితి. భక్తుడు ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటాడు, భక్తుడి శరీరాన్ని భగవంతుడు ఉపయోగించుకొంటాడు అంతే. ఇప్పడు ఈ పుస్తకం నా స్వాధీనంలో ఉంది. దానిని పూజిస్తే నన్ను పూజించావు అని అనదు, దానిని కింద పడేసాను అనుకోండి నన్ను కింద పడేసావు అని ఏమీ అనదు. కింద పడేసినప్పడు ఎలా ఉంటుందో, దానిని పూజించినప్పడు అలాగే ఉంటుంది. అలాగే భక్తుడి శరీరం, మనస్సు ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటాయి. ఆయన ఎక్కడ కూర్చోబెడితే అక్కడే, ఏ పని చేయిస్తే అదే, తను అంటూ అక్కడ లేడు, ఉన్నది ఈశ్వరుడే, అంతా ఆయనే, అటువంటి భక్తి కుదరాలి, దానికి ఎంతో పూర్వపుణ్యం ఉండాలి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-08-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు కృష్ణాష్టమి. కృష్ణుడు మధురలో జన్మించాడు. మనందరం తల్లికడుపులో నుండి వచ్చాము. కాని కృష్ణుడు అందరి మనుషులు లాగ పుట్టలేదు. ఆయన మధురలో జైలులో పుట్టినవాడివలె కనిపించాడు. మహావిష్ణువే దేవకీదేవి దగ్గర కృష్ణుడి రూపం ధరించాడు. కృష్ణుడిని పరిపూర్ణావతారం అంటారు. అంటే భగవంతుడికి ఎన్ని కళలు ఉన్నాయో అన్ని కళలతోటి జన్మించినవాడు కృష్ణుడు. దేవకీ వసుదేవులకు వివాహం అయిన

తరువాత కంసుడు ఇంటికి తీసుకొనివెళుతూఉంటే నేనే రాజుని అని అనుకొంటున్నావు, నీతోబుట్టువు అష్టమగర్భంలో నిన్ను చంపేవాడు పుడతాడు అని కంసుడితో అశరీరవాణి చెప్పింది. అప్పుడు కంసుడు దేవకిని చంపటానికి కత్తి తీస్తాడు. వసుదేవుడు ఏమని చెప్పాడు అంటే నీతోబుట్టువును చంపవద్దు, పిల్లలు పుట్టగానే ఆ పిల్లలను నీకు ఇచ్చేస్తాము వారిని నువ్వు చంపేయి అని చెప్పాడు. మీరు ఎక్కడో ఉంటే పిల్లలను చంపటం ఎలా కుదురుతుంది అని అప్పడు దేవకీవసుదేవులను జైలులో పడేసాడు. పిల్లలు పుడితే వరుసగా కంసుడికి ఇచ్చేవారు, కంసుడు వారిని చంపేసేవాడు అష్టమగర్భం వచ్చేటప్పటికి కృష్ణుడు దర్శనమిచ్చాడు, అక్కడ పుట్టిన వాడి వలె కనిపించాడు. ఆయన వసుదేవుడితో ఏమని చెప్పాడు అంటే నన్ను గోకులంలో నందుడి ఇంటిలో ఉంచు, అక్కడ ఉన్న యోగమాయను తీసుకొని వచ్చి ఇక్కడ ఉంచు అని చెప్పాడు. వసుదేవుడు కృష్ణుడిని తీసుకొని వెళుతూ ఉంటే అప్పడు యమునానది వరదలతో ఉంది. నదిని దాటటం ఎలాగ అని అనుకొంటూ ఉంటే అప్పడు యమునానది ఆయనకు దారి ఇచ్చింది. కొంచెం దూరం వచ్చాక నది పెరగటం ప్రారంభించింది, వీడిని ముంచేయటానికి కాదు, కృష్ణుడి పాదాలను ముద్దుపెట్టుకోవాలని నదికి అనిపించింది. కృష్ణుడి పాదాలను ముద్దుపెట్టుకొన్నాక మరల అణిగిపోయింది. కృష్ణుడిని తీసుకొనివచ్చి నందుడి ఇంటిదగ్గర ఉంచి అక్కడ ఉన్న యోగమాయను తీసుకొనివెళ్ళి దేవకి దగ్గర ఉంచాడు. అష్టమగర్భంలో అమ్మాయి పుట్టింది అని బటులు వెళ్ళి కంసుడికి చెప్పారు. అప్పడు యోగమాయను తీసుకొనివచ్చి చంపటానికి పైకి ఎగరవేసాడు కంసుడు. కిందపడకుండా పైకి ఎగిరిపోతూ యోగమాయ ఏమని చెప్పింది అంటే ఓరేయ్ నేనుకాదు, నిన్ను చంపేవాడు పుట్టేసాడు, గోకులంలో పెరుగుతున్నాడు, వాడి చేతిలో నువ్వు చనిపోతావు, నిన్ను ఎవరూ రక్షించలేరు అని చెప్పి మాయమైపోయింది. అప్పడు గోకులంలో ఉన్న పిల్లలను చంపటానికి రాక్షసులను పంపాడు. పూతన అనే రాక్షసి వచ్చి తన స్థనాలకు విషం రాసుకుని యశోదతో పిల్లవాడికి పాలు ఇస్తాను అని చెప్పింది. కృష్ణుడు ఏమి చేసాడు అంటే పాలు తాగాడు, తాగాడు తరువాత దాని రక్తం కూడా తాగేసాడు, అప్పడు పూతన చనిపోయింది. పిల్లవాడిగా ఉండగానే గోకులంలో చాలామంది రాక్షసులను చంపాడు.

యశోద కృష్ణుడిని గోవిందా, దామోధర, మాధవ అని పిలిచేది. మనం కూడా ప్రాణం శరీరాన్ని విడిచిపెట్టిపోయేటప్పడు గోవిందా, దామోధర, మాధవ, నారాయణ అని

స్మరించుకొంటే మనకు మోక్షానికి అర్హత కలుగుతుంది. మనం హృదయంలో పనికిరాని గొడవలు అన్నీ మోస్తూ ఉంటాము, అందుచేత ప్రాణంపోయే టైములో ఆ గొడవలే జ్ఞాపకం వస్తాయి కాని మనకు దేవుడు జ్ఞాపకం రాడు. మనకు రోజూ రాత్రి బుల్లి చావు వస్తుంది. అంటే మనం నిద్రలోనికి వెళ్ళినప్పుడు దానిని బుల్లిచావు అంటారు. నిద్రలో మనకు ఏమీ తెలియదు. అందుచేత నిద్రపోయినవాడు చనిపోయినవాడితో సమానం అంటారు. మనం నిద్రలోనుండి లేచినప్పుడు అదే శరీరంలో లేస్తాము, చనిపోయాక అయితే ఇంకో శరీరంలో లేస్తాము అందుచేత నిద్రను బుల్లిచావు అంటారు. ఈ చిన్నచావుకు ముందు రోజూ నామం ప్రాక్టీసు చెయ్యండి. పెద్దచావు వచ్చినప్పుడు అదే వస్తుంది. కృష్ణుడు వెన్నదొంగిలించాడు అంటే దాని అర్థం మీ మనస్సు వెన్నపూస అంత మృదువుగా అయితే మీ మనస్సును ఆయన దొంగలించి ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, అదీ వెన్నపూస దొంగతనం అంటే. కృష్ణుడు చెప్పేది ఏమిటి అంటే మీ డబ్బును, బంగారాన్ని ఇంట్లో పెట్టుకోండి. మీ మనస్సులో డబ్బును, బంగారాన్ని మొయ్యవద్దు, మనస్సులో భగవంతుడిని మొయ్యండి, మనస్సులో భగవంతుడిని పెట్టుకోండి.

నేను అనే తలంపు, నాది అనే తలంపు ఈ రెండు తలంపులే మనిషిని పాడు చేస్తున్నాయి. ఎవడు పాపం చేసినా, దోషం చేసినా ఈ రెండు తలంపులే కారణం. ఈ రెండు తలంపులు ఉన్నంతకాలం పైకి పెద్దమనుషులకింద కనిపించినా పాపాలు చేయకుండా, దోషాలు చేయకుండా ఎవడూ ఉండలేడు. మనలో ఉన్న దోషాలను తొలగించటానికే మహావిష్ణువు రాముడి రూపంలో, కృష్ణుడి రూపంలో వచ్చాడు. మనం వారిని స్మరిస్తే చాలు మనలో ఉన్న దోషాలను బయటకు తోలేసి మనలను పరమపవిత్రులుగా చేస్తారు. అందుచేత మనం రాముడిని స్మరించినా, కృష్ణుడిని స్మరించినా మనం తరిస్తాము. సీతమ్మ లంకలో అశోకవనంలో ఉన్నప్పుడు ఆంజనేయస్వామి అక్కడకు వెళతాడు. అప్పుడు సీతమ్మ రాముడి వియోగంలో ఉంది. ఆంజనేయస్వామి చూస్తున్నప్పుడు రాముడికి దూరంగా ఉన్న సీతమ్మ ఎలా ఉందో వాల్మీకి చెపుతాడు అంటే భగవంతుడికి దూరమైన జీవుడు ఎలా ఉంటాడో వాల్మీకి ఇక్కడ వర్ణిస్తాడు. సీతమ్మ ఎలా ఉంది అని వాల్మీకి చెప్పాడు అంటే నీరు లేని చెరువులాగ ఉంది, సూర్యగ్రహణం రోజున సూర్యుడు ఎలాగ ఉంటాడో అలాగ ఉంది, డబ్బుకోసం ఎదురుచూస్తూ ఎన్నాళ్ళకు డబ్బు అందకపోతే వాడి మొఖం ఎలాగ ఉంటుందో అలాగ ఉంది, నిందలు మోస్తున్న కీర్తిమంతుడిలాగ ఉంది, పూజ శ్రద్ధగా చేస్తూ ఉంటే ఏ

కారణం వలన అయినా ఆ పూజ మధ్యలో ఆగిపోతే వారి మొఖాలు ఎలా ఉంటాయో సీతమ్మ అలా ఉంది అని చెప్పాడు. ఇవన్నీ సీతమ్మను వంపుపెట్టుకొని మనకు చెపుతున్నాడు.

మన మనస్సులో కల్మషం ఉండటం వలన మనకు భక్తి యొక్క విలువ తెలియటం లేదు. మనస్సులో ఉన్న కల్మషం మనకు భగవంతుడి పాదాల యందు గౌరవం కలగనివ్వదు. ఇది మహామాయ. పామునోట్లో ఉన్న విషం పామును చంపదు. అది ఎవరిని కరిస్తే వారిని చంపుతుంది. అలాగే భగవంతుడిలో ఉన్న మాయ ఆయనను ఏమీ చేయదు. ఆ మాయలో తగులుకొన్నవారందరూ మసి అయిపోతారు. మనం భగవంతుడి పాదాలను ఆశ్రయిస్తే, భగవంతుడి స్వాధీనంలో మాయ ఉంది కాబట్టి ఆ మాయ మనకు దారి ఇస్తుంది, మనం భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మాయ ప్రక్కకు తప్పకొంటుంది, రామకృష్ణుడి తల్లి చనిపోయిన తరువాత ఆ శవానికి నిప్పపెట్టేముందు ఆవిడ పాదాలకు నమస్కరించి రామకృష్ణుడు ఒక విచిత్రమైన మాట చెప్పాడు. నేను నీ కడుపున పుట్టానమ్మా, నేను ధన్యుడను అని ఆయన అనలేదు, నువ్వు నన్ను కన్నావు కాబట్టి నువ్వు ధన్యురాలవమ్మా అన్నాడు అంటే ఈ శరీరంలో భగవంతుడిని కడుపులో మోసావు కాబట్టి నీవు ధన్యురాలవు. కృష్ణుడి రాసలీలలు గురించి చెపుతారు, అప్పడు ఆయన వయసు ఐదేళ్ళు. ఐదేళ్ళ పిల్లవాడికి కామక్రోధాలు ఏముంటాయి. ఇందులో రహస్యం ఉంది. మన హృదయంలో ఉన్న శత్రువులు కామక్రోధములు, ఇవి జన్మజన్మల నుండి మన కూడా వస్తున్నాయి. కృష్ణుడి తత్వం మీకు అర్థమైతే, ఆయన రాసలీలలు చదివి ఆనందించగలిగితే మీలో ఉన్న కామక్రోధములు సమూలంగా నాశనమవుతాయి.

బాగుపడాలనుకునేవారు, ఆధ్యాత్మికంగా జీవితం గడపాలనుకునేవారు భాగవతం చదవండి. భాగవతం చదివినప్పడు కృష్ణుడి మీద ప్రేమ పుట్టకుండా ఆగదు, కృష్ణుడిని ప్రేమించకూడదు అని మీరు అనుకొన్నా కృష్ణుడిని ప్రేమించకుండా ఉండలేరు. కర్మ ఏడుస్తూ చెయ్యకు, యజమానిలాగ చెయ్యి అని పరమాత్మ చెప్పాడు. మనకు ఉద్యోగం అంటే ఇష్టమే, జీతం అంటే ఇష్టమే కాని పని అంటే ఇష్టం ఉండదు. ఉద్యోగం దొరకాలి, జీతం వచ్చేయాలి, పని చెయ్యకూడదు. పని ఏడుస్తూ చెయ్యకు, ఇష్టంగా చెయ్యి, బాధ్యతగా చెయ్యి. మనకు ఎంతోకొంత భక్తి ఉంది అనుకొంటున్నాము. గోపికలు కృష్ణుడితో ఏమన్నారు అంటే మా దగ్గర ప్రేమ ఏమి ఉంది, మేము మొద్దులం, నువ్వే మాకు ప్రేమ ఇచ్చావు, నువ్వు ఇచ్చిన ప్రేమతో ప్రేమించబడుతున్నావు, ఇందులో మాది ఏమీ లేదు నీ పట్ల భక్తిని నువ్వు మాకు

ప్రసాదించకపోతే నీ పట్ల మాకు భక్తి ఎలా కలుగుతుంది, ఈ జీవలక్షణాలతో బతుకుతున్న మాకు అది సాధ్యమా కృష్ణా అన్నారు గోపికలు. మాకు భక్తి ఉంది, దేవుడియందు ప్రేమ ఉంది అని మనం అనుకొంటున్నాము కాని గోపికలకు ఉన్న బుద్ధి మనకు లేదు. కృష్ణుడు అతి బలవాన్. ఆయన మిమ్మల్ని చంపాలి అనుకొన్నాడు అనుకోండి, ఆయనకు ఆయుధాలు అక్కరలేదు. ఏమ్మా బాగున్నావా అని ఇలా చెయ్యి వేసాడు అంటే చనిపోతావు. కృష్ణుడి దగ్గర ప్రమాదం ఏమిటి అంటే మీరు ఆయనకు ఏది ఇస్తే అది మనకు తిరిగి వచ్చేస్తుంది. మీరు కృష్ణుడికి ఒక పైసా ఇస్తే మీకు వెయ్యి పైసలు వచ్చేస్తాయి. ఒకసారి ధర్మరాజు కృష్ణుడితో ఏమన్నాడు అంటే నాలో ఏమైనా దోషాలు ఉంటే నీకు ఇచ్చేస్తాను అన్నాడు. అప్పడు భీముడు ఏమన్నాడు అంటే ఎప్పడూ అలా చెయ్యవద్దు, ఆయన మాయావి. ఏదో బావ బావ అని తిరుగుతున్నాడు అని ఆయన వలలో పడకు. నీలో ఉన్న నాలుగు దోషాలు ఆయనకు ఇచ్చావు అనుకో మరల వెయ్యి రెట్లు వచ్చి నీమీద పడతాయి, నువ్వు మొయ్యలేవు. ఈ నాలుగు దోషాలు ఏముంది, ఏదో అనుభవిస్తే పోతాయి అని చెప్పాడు.

కృష్ణం వందే జగద్గురుం. కృష్ణుడు కేవలం ఒక ప్రాంతానికి గురువు కాదు, జగత్తుకంతా గురువు. మనం కృష్ణుడిని ఎంతసేపు దేవుడిగానే చూస్తాము కాని గురువుగా చూడము. ఆయన ఎంత గొప్ప దేవుడో అంత గొప్ప గురువు కూడా. కృష్ణుడిని మధురకు తీసుకొని రావటానికి కంసుడు అక్రూరుడను పంపిస్తాడు. బృందావనం నుండి కృష్ణుడిని తీసుకొని పోవటానికి అక్రూరుడు వస్తే గోపికలు వాడిని పట్టుకొని తిడతారు. వీడు మాతోటి ఆడుకొంటున్నాడు, వీడిని మాకు దూరం చేస్తున్నావు ఏమిటి? నీకు ఆ పేరు ఎవరు పెట్టారు నీవు క్రూరుడవేగాని అక్రూరుడవుకాదు, పరమాత్మను మాకు దూరం చేస్తున్నావు అంటారు గోపికలు. అంటే వారు కృష్ణుడిని బాహ్యంగానే చూస్తున్నారు. కృష్ణుడు ఎవరు? ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. కృష్ణుడుని మన హృదయంలో దర్శించాలి. ఎప్పడైతే భగవంతుడిని మనలో అంతర్యామిగా దర్శించామో అది మన కడసారి జన్మ. అయితే కామక్రోధముల నుండి విడుదల పొందకుండా ఆయనను దర్శించటం సాధ్యం కాదు. ఒక మంచివాడు కృష్ణుడితో అన్నాడు అందరూ నన్ను గుణవంతుడు అంటున్నారు, నాలో మంచి గుణాలు ఉన్నాయి అని నాకు తెలుస్తోంది. ఓ మాధవా! ఎందుకు నాకు ఈ మంచి గుణాలు, ప్రజలు చెప్పకోవటానికా? నీలో ఐక్యం అవ్వటానికి సహకరించని ఈ మంచిగుణాలు నిజంగా మంచిగుణాలేనా, ఇవి నాకు ఎందుకు కృష్ణా అంటాడు, అదీ గొప్పతనం. మీరు

మంచివారు అని ఎవరైనా మనతో అంటే పొంగిపోతాము. కాని ఇక్కడ ఏమి చెపుతున్నాడో చూడండి నీలో ఐక్యం కావటానికి పనికిరాని గుణాలు నాకు ఎందుకు కృష్ణా అంటున్నాడు, ఎంత సుప్రీంగా చెపుతున్నాడో చూడండి.

కృష్ణుడు ఒకసారి కుంతీదేవితో అమ్మా నీకు ఏమి కావాలి అని అడిగాడు. నాకు ఎప్పుడూ కష్టాలు ఇయ్యి వాసుదేవా అని చెప్పింది. నువ్వు కష్టాలు కోరుకొంటున్నావు ఏమిటి అని అడిగాడు. కష్టాలు అనుభవిస్తే ఆ మనిషి పరమపవిత్రుడు అవుతాడు, నిన్ను తెలుసుకొనే యోగ్యత కలుగుతుంది అని చెప్పింది. ప్రారబ్దాన్నిబట్టి మీకు ఎవరికైనా కష్టాలు వస్తే వాటిని ఇష్టంగా కనుక అనుభవిస్తే మీరు స్వచ్ఛమైపోతారు, భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మీకు అర్హత కలుగుతుంది. పరమేశ్వరుడు ఏమి చేసాడు అంటే కామాన్ని బూడిద చేసాడు, కాలాన్ని తన్నాడు. కాలం వలన చావు వస్తుంది, కామం వలన పుట్టుక వస్తుంది. ఈ రెండింటిలో నుండి నువ్వు బయట పడాలంటే ఈ రెండింటిని తన్ని విడిచిపెట్టిన పరమేశ్వరుడి పాదాలను ఆశ్రయించు అని జీవుడికి బోధిస్తున్నాడు. వాసనలోనుండి తలంపులు వస్తాయి. తలంపులలో నుండి సందేహాలు వస్తాయి. వాసనారాహిత్యం పొందేవరకు ఆత్మస్థితిని పొందలేడు. ఆత్మస్థితి కలిగేవరకు మంచిని చెడ్డ అనుకొంటాము, చెడ్డను మంచి అనుకొంటాము, ఏదో రకమైన సందేహం మనిషిని పీడిస్తూ ఉంటుంది, భయం పీడిస్తుంది, అనుమానం పీడిస్తుంది, వేదన పీడిస్తుంది, చనిపోయిన తరువాత జీవితం ఎలా ఉంటుంది అని భయం కలుగుతుంది, ఆత్మస్థితిని పొందిన తరువాత ఇంక సందేహాలు ఉండవు. కృష్ణుడు చివరి రోజులలో ఉద్ధవుడికి భక్తి గురించి చెప్పాడు. మామూలుగా మనం జ్ఞానం గొప్పది అనుకొంటాము కాని భక్తి రుచి తెలిసాక జ్ఞానం కూడా అక్కరలేదు అనిపిస్తుంది, అది పరాభక్తి. జరాసంధుడు కృష్ణుడిమీదకు వస్తే ఆయన పారిపోయేవాడు కాని జరాసంధుడిని చంపటానికి ఒప్పకోలేదు. ఈ మాయను అర్థం చేసుకోండి. జరాసంధుడి ప్రారబ్దం ప్రకారం వాడు భీముడి చేతిలో చనిపోవాలి. ఈయన చంపకూడదు, ఆ ప్రారబ్దాన్ని గౌరవించటానికి ఆయన జరాసంధుడితో యుద్ధం చేయలేదు.

భాగవతంలో రంతిదేవుడి చరిత్ర నాకు బాగా ఇష్టం. శరీరాన్ని ప్రారబ్దానికి వదిలేసిన వాడు రంతిదేవుడు. ఏ ప్రారబ్దం అనుభవించటానికి ఈ దేహం వచ్చిందో ఆ ప్రారబ్దమే ఈ దేహాన్ని పోషిస్తుంది అని ఆయన నమ్మకం. రంతిదేవుడికి సంతోషం వస్తే పొంగిపోలేదు,

ఏదైనా కష్టం వస్తే కుంగిపోలేదు. ఎందుచేతనంటే సంతోషం వచ్చినా, కష్టం వచ్చినా ఏదైనా ప్రారబ్దాన్ని బట్టి వచ్చింది నాకేమీ సంబంధం లేదు అన్నాడు. దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి ఆయన హాయిగా ఉన్నాడు, వాడు రంతిదేవుడు. కృష్ణుడు ఈ భూమిమీద 120 సంవత్సరాలు ఉన్నాడు. అన్ని పాత్రలు పోషించాడు. ఆయన యుద్ధాలు చేసాడు, జ్ఞానం గురించి బోధించాడు, భక్తి గురించి చెప్పాడు, రాయబారిగా ఉన్నాడు. ఇలా అనేక రకాలుగా పనిచేస్తూ కూడా తాను తానుగానే ఉన్నాడు, అదీ ఆయన గొప్పతనం. ఎంతో వైవిధ్యం ఉన్న పాత్రలు పోషించాడు, ఏదో చెట్టుకింద కూర్చొని శాంతిగా ఉండటంకాదు, భారతయుద్ధం జరుగుతున్నప్పుడు కూడా శాంతిగా ఉన్నాడు. కర్మరంగంలో, యుద్ధరంగంలో కూడా నువ్వు శాంతిగా ఉండగలిగితే అది నిజమైన స్థితి.

అత్తలేనికోడలు ఉత్తమురాలు, కోడలు లేని అత్త ఉత్తమురాలు. అత్తలేదు కాబట్టి అది ఉత్తమురాలుగా కనిపిస్తోంది, అత్త ఉంటే దాని మజాకా తెలుస్తుంది. ఎంతమంది కోడళ్ళు ఉన్నా, ఎంతమంది అత్తలు ఉన్నా, నీవు ఏ రంగంలో ఉన్నా నీ శాంతి చెదరకూడదు, అది నిజమైన శాంతి. ఇంట్లోవారు అందరూ నిన్ను పీక్కు తింటున్నారు అనుకో అప్పుడు కూడా నీ శాంతి చెదరకూడదు. గోపికలు కృష్ణుడిని ప్రేమిస్తున్నారు, ఆత్మగా ప్రేమించటంలేదు, ఒక శరీరంగా ప్రేమిస్తున్నారు, వారికి దేహాభిమానం పోలేదు, అది కృష్ణుడు గమనించాడు. గోపికలు ఒకరోజు చెరువులోనికి దిగి స్నానాలు చేస్తున్నారు. గట్టుమీద పెట్టుకొన్న బట్టలను కృష్ణుడు తీసుకునిపోయి చెట్టు ఎక్కి కూర్చున్నాడు. మీ బట్టలు ఇవ్వను అని ఆయన అంటాడు, మేము చెరువులో నుండి బయటకు రాము అని గోపికలు అంటారు. కృష్ణుడు అల్లరివాడు, కొంటెవాడు ఈయనను పూజించమంటున్నారు అని మీకు అనిపిస్తుంది. మనం ఎవరము అంటే ఆత్మ, కాని మనం దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము, దేహబుద్ధి మనకు పోవటంలేదు. గోపికలు భక్తులేగాని స్త్రీ పురుషబేధం వారికి పోలేదు. ఆత్మానుభవం పొందిన తరువాతగాని స్త్రీపురుషబేధం పోదు. ఆత్మకు శరీరం లేదు. శరీరం ఉంటే సెక్స్ కాని శరీరం లేనివాడికి సెక్స్ ఏమిటి? నేను బట్టలు ఇవ్వను అని ఆయన అంటాడు, మేము బయటకు రాము అని గోపికలు అంటారు ఇలా కొంతసేపు ఘర్షణ జరిగాక గోపికలు నీటిలో నుండి బయటకు వచ్చి చేతులు పైకెత్తి కృష్ణా మా బట్టలు మాకు ఇచ్చేయి అన్నారు. అంటే ఆ రకంగా వారికి దేహాభిమానాన్ని పోగొట్టి వారికి బట్టలు ఇచ్చేసాడు, ఆరకంగా గోపికలకు మహోన్నతంగా

చైతన్యస్థాయిని పెంచేసిన తరువాత బట్టలు ఇచ్చేసాడు, వాడు కృష్ణుడు. సెక్స్ భావనను ఓవర్‌కమ్ చేయించటానికి ఎంత ప్రక్రియ చేసాడో చూడండి, వాడు పరమాత్మ. ఇది సామాన్య మానవుడు చేసేపని కాదు. వాడు అల్లరివాడు కింద మీకు కనిపించవచ్చు, మీకు ఎలా కనిపించినా ఆయన పరమాత్మ.

మనకు దేవుడు అంటే ఇష్టం ఉండదు, మన శవాలంటే మనకు ఇష్టం. మన శరీరానికి స్నానం చేయించటం, దానికి అన్నం పెట్టటం, శరీరం అందరికీ అందంగా కనిపించేలా మంచి బట్టలు వేసుకోవటం ఇలా ఎంతసేపు ఈ శవం చుట్టూ తిరుగుతున్నాము కాని దేవుడి చుట్టూ తిరగటంలేదు. మనకు ఉన్న దేహబుద్ధిని పోగొట్టటంకోసం మన ఇంద్రియాలను, మనస్సును పిండుతాడు, వాడు దేవుడు. పుట్టినదానికి ప్రారబ్దం, పుట్టనిదానికి ప్రారబ్దం ఏమిటి? నువ్వు ఆత్మ అయి ఉన్నావు. ఆత్మకు పుట్టుకలేదు శరీరం పుట్టింది, అది నువ్వు కాదు. ప్రారబ్దం ఎవరికి అంటే శరీరానికే ప్రారబ్దం. అది నువ్వు కాదు అని తెలిసినప్పడు ప్రారబ్దం నిన్ను దెబ్బలు కొట్టలేదు. దూడను కట్రాడుకు కట్టేస్తే, అది తెంపుకొనిపోయింది అనుకో ఇంక యజమాని కూడా దానిని ఏమీ చేయలేడు అలాగే దేహాభిమానం పోయినవాడిని ఈశ్వరుడు కూడా ఏమీ చేయలేడు, ఆ స్టేజికి ఎగిరివెళ్ళిపొమ్మంటున్నాడు. గోపికలకు ఉన్న దేహాభిమానాన్ని పోగొట్టటానికి కృష్ణుడు వారి బట్టలను దొంగలించాడు. వేలాది సంవత్సరాలు తపస్సు చేస్తేగాని కొంతమందికి దేహాభిమానం పోదు. వేలాది జన్మలు తపస్సు చేసి పోగొట్టుకోలేని దేహవాసనను, కామవాసనను కొన్ని క్షణాలలో తీసేసాడు, హృదయంలో మోస్తున్న బంధాలను ఏదో నెపం పెట్టి బయటకు లాగేసాడు, వాడు పరమాత్మ. సూర్యచంద్రులకు వెలుగును ఎవడు ఇస్తున్నాడో వాడే మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడిని మన హృదయంలో పెట్టుకొని ఆయనకోసం దేశం అంతా తిరుగుతున్నాము. మన స్వరూపంలో సుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. అది తెలియకపోవటం వలన సుఖం కోసం, శాంతికోసం బజారులో వెతుక్కుంటున్నాము.

ఈ మధ్యన ఒక భక్తుడు ఏమి చెప్పాడు అంటే దేవుడి సంకల్పాన్ని నా సంకల్పం చేసుకొన్నాను, దేవుడి ఇష్టాన్ని నా ఇష్టం చేసుకొన్నాను అప్పటి నుండి సుఖపడుతున్నాను నాన్నగారు అని చెప్పాడు. నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం అని దేవుడితో చెపుతున్నాను, ఈ మాటలు నోటితో అనటంకాదు, లోపల ఆ నిర్ణయానికి వచ్చేసాను,

అప్పటినుండి సుఖంలో ఓలలాడుతున్నాను అని చెప్పాడు. భవిష్యత్‌లో దుఃఖం తీసుకొని వచ్చే ఆలోచనలు చెయ్యకండి, భవిష్యత్‌లో దుఃఖం తీసుకొని వచ్చే పనులు చేయకండి, భవిష్యత్‌లో మీకు దుఃఖం తీసుకొని వచ్చే స్నేహాలు చేయకండి. సజ్జనసాంగత్యం ఎందుకు అంటే ఏ హృదయంలో అయితే అంతర్యామి ఉన్నాడో అక్కడ మనస్సు స్థిరపడటానికి సజ్జనసాంగత్యం అవసరం. సత్పురుషులతో సహవాసం వలన మనస్సు నిర్మలమవుతుంది, మనస్సు పవిత్రమవుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. మనస్సుకు లోచూపు కలిగి దాని మూలంలోనికి అది ఉపసంహరింపబడినప్పుడు మనస్సు నశిస్తుంది, అప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది. కొంతమంది ఇంట్లోవారి మీద విపరీతమైన మమకారం పెట్టుకొంటారు. వారికి కడుపు నొప్పి వస్తే వీరికి వచ్చింది అంటారు, వారు ఏడిస్తే వీరు ఏడుస్తారు, అంత మమకారం పెట్టుకొంటారు. మమకారం నీకు క్షోభ తెచ్చిపెడుతుంది. నువ్వు పని చెయ్యి మమకారం పెట్టుకోవద్దు.

బలవంతంగా నువ్వు ఏ పని చెయ్యవద్దు. నువ్వు కర్మకు యజమానిగా ఉండు, బానిసగా ఉండవద్దు. ఏదో ఋణసంబంధం అండీ, ఏదో చాకిరీ చేస్తున్నాము అని ఇలా ఏడుస్తూ ఎంతకాలం పనిచేస్తావు అంటున్నాడు కృష్ణుడు. కృష్ణుడు చెప్పేది ఏమిటి అంటే మీరు చేసే పని మీరు మోక్షం పొందటానికి సహకరించాలి అంటే ఎలా పని చేస్తే మీకు మోక్షం కలుగుతుందో అలా పనిచెయ్యటం నేర్చుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. కర్మను యోగంగా చేయండి. మనం ఏ పని చేస్తున్నామో ఆ పని కనబడాలి, మనం కనబడకూడదు. మీరు ఏదైనా మంచి పని లోకానికి చేసారు అనుకోండి, ఆ పని లోకానికి కనబడవచ్చు కాని మీరు కనబడకూడదు. ఆ పని నేను చేసాను అనే తలంపు అసలు లోపల ఉండకూడదు. కృష్ణుడు చెప్పే కర్మ రహస్యం ఏమిటి అంటే మీరు పని ఎలా చెయ్యాలి అంటే పని జరుగుతూ ఉండాలి అక్కడ నేను కనబడకూడదు, ఆ పని పూర్తి అయ్యేటప్పటికి ఈ నేను కూడా పోవాలి. ఈ నేను పోయిన తరువాత ఉన్నది బ్రహ్మమే. మనం ఎలా చేస్తాము అంటే ఆ పని పూర్తి అయ్యేటప్పటికి నేను పెరిగిపోతుంది, మీ అనుభవంలో చూసుకోండి. గోపికల భక్తి ఎంత పరాకాష్టకి వెళ్ళిపోయింది అంటే మాకు ముక్తి వద్దు, భక్తే చాలు అంటారు. అంటే వారు భక్తిలో ఎంత సుఖాన్ని, ఆనందాన్ని అందుకోవాలో అంత సుఖాన్ని, ఆనందాన్ని అందుకొంటున్నారు.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 13 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| సెప్టెంబర్ | 23 | హైదరాబాద్ సత్యసాయి నిగమ్ (సద్గురు శ్రీ నాన్నగారి పుట్టినరోజు) |

# ఆశకోసం బ్రతకకూడదు - ఆశయం కోసం బ్రతకాలి

కీర్తి తృష్ణ తరచు మానవుణ్ణి సత్య పథం నుంచి దూరం చేస్తుంది మనం వస్తువులను భోగించాలని కోరుకొంటాము. భోగాశక్తి ఆత్మకు లేదు అహంకారానికే. జీవించటానికై ఆశ పడకూడదు. మరణించటానికై భయపడకూడదు. సంతుష్టుడై జీవించాలి. గొప్పవాన్ని కావాలని ఎప్పడూ కోరుకోకూడదు. మనం ధర్మ తత్పరులము కావాలంటే ఆశలను, కోరికలను జయించాలి. మమత ఎప్పడూ పరాయి వస్తువులమీద ఉంటుంది. ప్రేమ తనపై ఉంటుంది. ఎలా అంటే శరీరం మనది కాదు. ప్రపంచ వస్తువులు మనం కావు మనం వైరు - శరీరం వేరు మనకై వాటిని కోరుకొంటాము ఇది అంతా మనస్సుచేసే గారడీ. కనీసపు అవసరాలకోసం దొరికిన దానితో తృప్తిపడేవాడే భాగ్యవంతుడు. ఇనుపగొలుసులకంటే ఆశ ధృఢమైనది. ఎలా అంటే ఇనుప గొలుసులు కాల ప్రవాహంలో క్షయించిపోతాయి. కాని ఆశ ఇంకా వృద్ధి అవుతుంది. ఎక్కడ ఆశలు ఉంటాయో అచ్చట బండపాశాలు, దుఃఖరాసులు ఉండి మహాబాధను కలిగిస్తాయి. మనం అనుసరించదగ్గది ఒక్కటే మార్గము. ఆశపరిత్యాగమే. ఎంత సంతోషస్థితిలో కూడా నిర్లిప్తత కోల్పోకూడదు. మనః ప్రశాంతిని వీడరాదు. మన ఆశయాలు, ఆకాంక్షలు అన్ని పిచ్చివే, పరధ్యానంలో గుడ్డిగా ఏర్పరుచుకొన్నవే వాటికి విలువలేదు. ఆశ అనేది నల్లమందులాంటిది. అది మనలను మత్తులోనూ, భ్రాంతిలోనూ ఉంచి మన జీవితాన్ని అందుల్లోకి జారిపోయేలా చేస్తుంది. మరి చావు వచ్చి తలుపు తట్టేసరికి అంతా మించిపోతుంది. కాబట్టి మనోగతమైన సకల ఆశల యందు కక్కిన అన్నమునందు ఎట్టి బుద్ధి ఉంటుందో అట్టి బుద్ధి ఉండాలి. దుష్ట సంకల్పములు గలవాడు కక్కినకూటిని తిన్న కుక్కతో సమానమని విచారించాలి. అట్టి విచారణ వల్లనే ముక్తి లభిస్తుంది. "శాశ్వతమైన సత్యాన్వేషణమే జీవితం" అంటోంది యజుర్వేదం. "ఆశలుడుగగాని పాశముక్తుడు కాడు; ముక్తుడైన గాని మునియుగాండు; మునియైనగాని మోహంబులుడుగవు" అన్నారు వేమన. కాబట్టి కైవల్యమే మన జీవిత ఆషయమని నమ్మి ఆచరిస్తే సొమ్ము. నమ్మకపోతే దుమ్ము అంతే.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం

# జ్ఞాన విజ్ఞాన యోగం

భగవంతుని శక్తి సర్వత్ర ప్రసరిస్తున్నది. ప్రకృతిలో అన్ని శరీరాల ద్వారా జరిగే ప్రతి కార్యం భగవంతుని విలాసమే. ఒక్క మానవులకే స్వేచ్ఛ ఉంది. మనలోని ఆలోచనలు, కోర్కెలు కూడ భగవత్ప్రేరణలే. శరీర భావముతో స్వార్థపరులమై ఇతరులకు హాని కల్గిస్తుంటాం. భగవద్భావం పెంచుకుంటే మంచిగా మారగలం. మనలో సత్త్వ రజస్తమో గుణాలున్నాయి. సత్త్వగుణం కొందరిలో, రజోగుణం కొందరిలో, తమోగుణం కొందరిలో ఎక్కువగా ఉండవచ్చు. ఈ గుణాలను నియంత్రించుకుని, నిస్వార్థంగా పనులు చేస్తుంటే మన కోరికలు హానికరంగా మారవు. జీవితం ఉన్నతమవుతుంది. ద్వేషం దరిచేరనీయక పరోపకార దృష్టి అలవరచుకోవాలి. ఈ త్రిగుణాలు మన ఉపకరణాలు అని గ్రహించి వాటిని మన సేవకులుగా వాడుకోవాలి. వీటిని నియంత్రించుకుని అరిషడ్వర్గాలను జయించిన వారే మహాపురుషులందరు. కోపము బలహీనపరుస్తుంది. సహనము, క్షమ చాలా అవసరము. క్షమ చేతకానివాని లక్షణం కాదు. శక్తి కలిగి ఉండి క్షమ ప్రదర్శించడం ఉత్తముల లక్షణం. మోహము మరియొక దుర్గుణం. మోహమనగా విపరీతమైన ఆకర్షణతో ప్రలోభపడడం. భగవద్భావంతో క్రోధం, మోహం వంటి అరిషడ్వర్గాలను జయించవచ్చు. త్రిగుణాలు మన అభివృద్ధి కొరకే ఇవ్వబడ్డాయి. వాటికి లొంగిపోయి జీవించడం అజ్ఞానం. జ్ఞానాన్ని విజ్ఞానంగా మార్చుకొనగల శక్తి మనకున్నది. అజ్ఞానం చాలా శక్తివంతమైనది. అది మనలను కిందికి లాగడానికి ప్రయత్నిస్తుంది. దానిని జయించటానికి ధైర్యం, పట్టుదల అవసరం. దానికి దైవభావం సహాయం చేస్తుంది. ధైర్యంతో ముందుకు సాగాలి. అప్పడే ఈ సమస్త నామ రూపాల వెనుక ఉన్న దివ్యత్వాన్ని గుర్తించగలం. మనలను మనమే ఉద్ధరించుకోవాలి. ఈ ప్రయత్నానికి భగవంతుని సహాయం తప్పక లభిస్తుంది. ప్రతి మతము ఇదే బోధిస్తుంది. భగవద్భావంతో జీవితం ఉన్నతపరచుకొనే విధానం నిర్దేశిస్తుంది. మత లక్ష్యం మరచిపోయి కర్మకాండలు పూజలలో కాలం గడుపుతూ అదే మత జీవితం అనుకొంటున్నారు. జీవిత ధ్యేయం ప్రాపంచిక సుఖాలనుభవించడం కాదు. కారాదు. ఆత్మజ్ఞానంతో స్వభావ సంస్కరణ ముఖ్యం. మత గ్రంధాలను పవిత్రమని పూజించటం కాదు, వాటిలోని జ్ఞానం గ్రహించి సాధనతో, ధ్యానంతో జీవితం సంస్కరించుకోవాలి. మనలోని త్రిగుణాలు, అరిషడ్వర్గాలు, పరిసరాల ప్రభావం మనలను ప్రక్కలకు లాగి దారి తప్పించాలని ఎప్పడూ ప్రయత్నిస్తుంటాయి. వీటినెదుర్కొని అనుకూలంగా మార్చుకోగల శక్తి మనకున్నది. మన నిజ తత్త్వం దైవత్వం అని గ్రహించినప్పడు దేహభావాలను, ప్రకృతిశక్తులను సమర్థంగా ఎదుర్కొనగలం. మహాత్ముల జీవితాలు మనం సరైన మార్గంలో నడవడానికి సహాయం చేస్తాయి. వారి జీవితాలలో వెల్లడైన భగవతత్త్వం విలాసం గ్రహించడం, మనం కూడా మన జీవితాలను ఆ విధంగా భగవత్ శక్తి సహాయంతో సంస్కరించుకోవటం మానవ జీవిత లక్ష్యం.

- సిలువేరు సుదర్శన్, హైదరాబాద్

---

**మతం బహుముఖమైనది. ఒక్కొక్క జాతి ఒక్కొక్క అంశాన్ని గ్రహించి అదే సమగ్రమనుకొంటుంది.**

**- బ్రహ్మానంద కేశవచంద్రసేన్**